క్లుప్తంగా

ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ బాధ్యులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, అనుమతిలేని పాఠశాలలను రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ బాధ్యుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈమేరకు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి గురువారం వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల బాధ్యులు ప్రణీత, కావ్య తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులను చేర్పించండి

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో తమ పిల్లలకు చేర్పించాలని ట్రిమ్రిస్ కౌన్సిల్ సర్వర్ మొహియొద్దీన్ కోరారు. వరంగల్ నగరంలోని మండిబజార్, ఎల్‌బీనగర్, తదితర ప్రాంత్రాల్లో హనుమకొండ హంటర్‌రోడ్డులోని హనుమకొండ(జీ–1) ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గురుకులాలల్లో అందజేస్తున్న సౌకర్యాల వివరాలు గల కరపత్రాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో పనిచేస్తున్న గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కరీమాబాద్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ నాయకుడు డిమాండ్ చేశారు. ఈమేరకు కరీమాబాద్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని ఢిల్లీలో రెజ్లర్లు చాలా రోజులుగా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ఉపేందర్, అప్పాజి, వాణి, దివ్య, సరిత, సూరయ్య, యాకుబ్‌పాషా, కిరణ్, సదానందం, రాజు, మురళి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని ఏషియన్ శ్రీదేవి మాల్ దగ్గర ఉన్న సాయిబాబా మందిరాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం సందర్శించి సాయినాథుడికి ప్రత్యేపూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వేయిగండ్ల రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ కాలనీలో అనారోగ్య సమస్యలతో మృతి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శించారు.

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్ పూజలు

కాశిబుగ్గ: వరంగల్ ఓసిటీలోని నూతనంగా నిర్మించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలు పూర్తిగా ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఈనెల 17వ తేదీన జిల్లా పర్యటనకు మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా ఆయన చేతుల మీదుగా అధికారికంగా క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని విశ్వసనీయంగా తెలిసింది. అయితే, గురువారం మంచి ముహూర్తం ఉండడంతో ఎమ్మెల్యే దంపతులు కొద్దిమంది సమక్షంలో పూజలు చేసినట్లు సమాచారం.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

గీసుకొండ: జిల్లాలో గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనవసరంగా అబార్షన్లు చేసే ఆస్పత్రుల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సీకేఎం ఆస్పత్రి డాక్టర్ బేతి కవిత మాట్లాడుతూ.. ఆడమగ అనే వివక్షను విడనాడాలని, ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రేవతి దేవి, పరశురాములు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు పాల్గొన్నారు.

చావు అంచుకు వెళ్లి తెలంగాణ తెచ్చారు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్



చెరువులో పూలు చల్లుతున్న అదనపు కలెక్టర్, తదితరులు



కరీమాబాద్‌లో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ గణేష్

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చావు అంచు వరకు వెళ్లి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెగడపల్లి ఎల్లమ్మ చెరువు కట్టపై జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందాయన్నారు. రైతులకు 24గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేశారు. తొలుత బోనాలు, బతుకమ్మలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్, కుడా మాజీ డైరెక్టర్ నన్నబోయిన రమేష్‌యాదవ్, అలాగే, మండలంలోని అన్ని గ్రామాల్లో ఊరూరా పండుగ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు.

పునరుద్ధరణతోనే చెరువులకు జలకళ

ఖిలా వరంగల్: తెలంగాణ ప్రభుత్వం తాగు, సాగు నీటికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పునరుద్ధరణతో చెరువులు జలకళను సంతరించుకున్నాయని వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్స్ పార్కులో ఆర్డీఓ మహేందర్ జీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ నేతృత్వంలో చెరువుల పండగను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ఆర్డీఓ మహేందర్ జీ, కుడా పీఓ అజిత్‌రెడ్డి, డీఈ మధుసూదన్‌రెడ్డి, మెప్మా పీడీ రేణుక, స్థానిక కార్పొరేటర్లతో కలిసి తొలుత కట్ట మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్డీఓ మహేందర్ జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, ఎస్సారెస్పీ పునర్నిర్మాణం, మరమ్మతులు, మిషన్ కాకతీయతో నేడు రాష్ట్రంలో 94 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, బైరబోయిన దామోదర్ యాదవ్, బోగి సురేష్, బయ్యస్వామి, సంగరబోయిన ఉమేష్, బిల్లా రవి, వాసుదేవ్, ధర్మరాజు, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కేవీకే ఆధ్వర్యంలో చెరువుల పండుగ

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో తిమ్మాపురంలో చెరువుల పండుగను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపల పెంపకం, ప్రాముఖ్యత, చేపలు ఏ సమయంలో పట్టుకోవాలో అనే పలు అంశాలపై గ్రామంలోని మత్స్యకారులకు మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ జి.గణేష్ వివరించారు. చేపలు పట్టే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు సూరయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సర్కారు ధ్యేయం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీ, శిశు, దివ్యాంగుల శాఖలతో పేదలకు ఆర్థిక చేయూత

కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీ, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖల ద్వారా నిరుపేదల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది.

దళిత బంధు

దళితుల సంక్షేమమే ధ్యేయంగా దళిత బంధు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4,153 మంది దళితులకు దళిత బంధు పథకం ద్వారా రూ.419 కోట్ల నిధులను అందజేసింది. రైతన్నలకు చేయూతనిచ్చేందుకు హనుమకొండ జిల్లా ఆత్మకూరులో 112 యూనిట్లు, దామెరలో 61 యూనిట్లకు రూ.4కోట్ల నిధులతో గొర్రెలు అందజేసింది. ఎస్సీ కార్పొరేషన్ పైలట్ ప్రాజెక్టుగా డెయిరీలను సర్కారు ఏర్పాటు చేసింది. ధర్మసాగర్, వేలేరు, హసన్‌పర్తి, ఐనవోలు మండలాల్లో 155 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.17 కోట్లను విడుదల చేసింది.

గిరిజనులకు రూరల్ ట్రాన్స్‌పోర్ట్ స్కీం

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గిరిజనులకు రూరల్ ట్రాన్స్‌పోర్ట్ స్కీం ద్వారా 2017 –18లో 10 మంది లబ్ధిదారులకు టాటా ఏస్ మెగా, టాటా ఎస్ఎఫ్‌సీ, మహీంద్రా బొలెరో, అశోక్ లేలాండ్ వాహనాలను సబ్సిడీపై అందజేసింది. ఈఎస్ఎస్ స్కీంలో భాగంగా 2017 –18 వార్షిక సంవత్సరానికి 124మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.1.23 కోట్ల సబ్సిడీ రుణాలు, 2020 –21 వార్షిక సంవత్సరానికి 156 మంది లబ్ధిదారులకు రూ.1.25 కోట్ల సబ్సిడీ రుణాలను సర్కారు పంపిణీ చేసింది. గుడుంబా ప్రభావిత వ్యక్తుల పునరావాస పథకం ద్వారా 76 మంది లబ్ధిదారులకు రూ.1.46 కోట్ల నిధులను అందజేసింది.

వెనుకబడిన తరగతుల కులవృత్తులకు సాయం

బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతుల కులవృత్తిదారులకు ప్రభుత్వం చేయూతనందించింది. సెలూన్, దోబీఘాట్లు, లాండ్రీలకు ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా 6602 మంది లబ్ధిదారులకు రూ.2.88కోట్ల నిధులతో ఉచిత విద్యుత్‌ను అధికారులు అందజేశారు. గుడుంబా పునరావాస పథకం ద్వారా 56 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.కోటి నిధులు కేటాయించారు. గల్ఫ్ బాధిత పునరావాస పథకం ద్వారా 45 మందికి రూ.63లక్షల నిధులు అందజేశారు. 11 ఫెడరేషన్‌ల ద్వారా 407 మంది కులవృత్తుదారులకు రూ.2 కోట్ల నిధులను కేటాయించారు.

దివ్యాంగుల సంక్షేమానికి..

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పునరావస పథకం ద్వారా 72 మంది లబ్ధిదారులకు రూ.52లక్షల నిధులు, 108 మందికి ట్రైసైకిళ్లు, 34 మందికి బ్యాటరీ వీల్ చైర్లు, 210 మందికి వీల్ చైర్లు, 425 మందికి హియరింగ్ మిషన్లు, 41 మందికి ల్యాప్‌టాప్‌లు, 32 మందికి స్మార్ట్‌ఫోన్లు, 36 మంది మెటోరైజ్డ్ వాహనాలు అందజేశారు. వివాహ ప్రోత్సాహకం కింద 62 మందికి రూ.62లక్షలను ప్రభుత్వం పంపిణీ చేసింది.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఖిల్లా వరంగల్: ఆజంజాహి మిల్లు భూముల్లోనే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మిల్లు భూముల్లోనే కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, కార్మిక నాయకులు నాగపురి వెంకటేశ్వర్లు, కత్తెర సాల జగన్, ఆకుల మురళి, బైరబోయిన ఐలయ్య, మచ్చ రాజు, రైతు సంఘం నాయకులు వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, కొండన్న, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి





చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎంపీ దయాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కడిపికొండ దళితులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వేనంబర్ 366లోని 32ఎకరాల పంచరాయి భూమి 64 మంది దళితులకు చెందినదని దళిత కుటుంబాలు తెలిపాయి. 'మా భూమిని మాకే ఇప్పించాలని' ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలను బాధితులు గురువారం అందజేశారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో చీఫ్‌విప్‌కు, హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని ఎంపీని అతని నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాధిత దళిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 1974లో కడిపికొండకు చెందిన 64మంది దళితులకు ప్రభుత్వం కేటాయించిన 32ఎకరాల పంచరాయి భూమిని టీఎన్జీవోస్ నాయకులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. సదరు భూమి విషయం కోర్టులో ఉన్నా కూడా సర్వే చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బస్కె రాజేందర్, లక్ష్మి, అనిత, విజయ, కోమల, సౌందర్య, రాధ, రాజయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి



డీఈఓ అబ్దుల్ హైని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

నయీంనగర్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని హనుమకొండ డీఈఓ అబ్దుల్ హైని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ కోరింది. ఈమేరకు డీఈఓ కార్యాలయంలో అబ్దుల్‌హైని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా బొల్లారపు సదయ్య మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యులు చాలామంది చాలీచాలని జీతాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లల స్కూల్ ఫీజులు వారికి మోయలేని భారమవుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పిస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఈ సందర్భంగా డీఈఓకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'దళితరత్న' గ్రహీతకు సన్మానం



దిలీప్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

హన్మకొండ: దళితరత్న అవార్డు గ్రహీత ఎల్తూరి దిలీప్‌ను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎల్తూరి దిలీప్‌ను మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కుమ్మరి రాజన్న మాదిగ, మంద రాజు, జన్ను దినేష్ మాదిగ, కొత్తూరి ప్రభాకర్ మాదిగ, పల్లె ఉదయ్ మాదిగ, రాజారపు కిరణ్ మాదిగ, తదితరులు అభినందించారు.

తాగునీరు తెచ్చిన గొప్పవ్యక్తి భగవాన్‌దాస్



నినాదాలు చేస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ ద్వారా నగరానికి నీరు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి, పేదల నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ అని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ 93వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని భగవాన్‌దాస్ విగ్రహానికి వినయ్‌భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ పేదల హక్కుల సాధనకు అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు భగవాన్‌దాస్ అనపి కొనియాడారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ నగర ప్రజలకు తాగు నీరు అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి పర్యటన నేపథ్యంలో బంద్‌కు పిలుపునిచ్చి సమస్య పరిష్కారానికి భగవాన్‌దాస్ కృషి చేయాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, కానుగంటి శేఖర్, భగవాన్‌దాస్ కుమారులు డాక్టర్ రాజ్‌సిద్ధార్థ్, అంబేడ్కర్, లెనిన్, సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, ఎన్.జ్యోతి, కె.భిక్షపతి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న చలో ఉస్మానియా మహా సదస్సును విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద వాల్ పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్ రావు, బాధ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ వెంకటగోపినాథ్, డాక్టర్ చిర్ర రాజు డాక్టర్ మాదాసి కనకయ్య పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి



మాట్లాడుతున్న రవికుమార్

న్యూశాయంపేట: కుల, మతాలకు అతీతంగా ప్రతీఒక్కరు సోదరాభావంతో మెలగాలని ప్రముఖ కవి రవికుమార్ సూచించారు. బజ్మే గుల్షన్ అదాబ్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హజ్ యాత్రికులకు గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు, తదితరులు పూలబొకేలో పూలలాగా కలిసి మెలిసి ఉంటారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవుల కవితలు సభికులను ఆకట్టుకున్నాయి. వరంగల్ జిల్లా నుంచి తరలివెళ్లే హజ్ యాత్రికులను సత్కరించారు. ప్రముఖ ఉర్దూ కవి వహీద్ గుల్షన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్, సిరాజుద్దీన్, సయ్యద్ ఫైజుల్లా, సయ్యద్ మిస్బా, అబ్దుల్‌ఖార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కాశీజీ సెంటర్ : జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వరంగల్ జిల్లా అకాడమిక్ అధికారి మాలోత్ సారయ్యనాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచ్చలవిడిగా, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను నగరమంతా ఏర్పాటు చేసి అసత్య ప్రచారం విస్తరింపజేస్తున్నారని, వెంటనే అధికారులు వాటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్, శివ, రమేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం 54వ డివిజన్ కమిటీ



మోహన్, అధ్యక్షుడు



ఉప్పల రాజు, కార్యదర్శి

నయీంనగర్: నగరంలోని 54వ డివిజన్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా నాయకులు కట్కం పెంటయ్య, కనుకుంట్ల రవికుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేశబోయిన మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల రాజు, ఉపాధ్యక్షులుగా కేశబోయిన రామకృష్ణ, జి.రవి, జాయింట్ సెక్రటరీలుగా మంగళ సదానందం, కచ్చకాయల కృష్ణ, కోశాధికారిగా కె.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా రాసమల్ల శ్రీనివాస్, యు.కుమారస్వామి, బొల్లం సుజిత్, తోటి రమేష్, ఠాగూర్ కిషన్, ఎస్.రవి ఎన్నికైనట్లు తెలిపారు.

'లక్ష్మిగణపతి' సేవలు అభినందనీయం

కాశిబుగ్గ: కాశిబుగ్గ లక్ష్మిగణపతి సహకార పరపతి సంఘం సేవలు అభినందనీయమని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ కొనియాడారు. సంఘం ఆధ్వర్యంలో కాశిబుగ్గలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు మల్లేష్, వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు వేముల నాగరాజు, వంగరి రవి, రాంప్రసాద్, శివకృష్ణ, సతీష్, రాజేశ్వరరావు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

అమృతలో 'ఇంటింటి రామాయణం' సినీ బృందం సందడి



మాట్లాడుతున్న హీరోయిన్ నవ్యస్వామి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అమృత థియేటర్‌లో ఇంటింటి రామాయణం సినిమా బృందం గురువారం సాయంత్రం సందడి చేసింది. ఈనెల 9న విడుదల కానున్న సినిమా ప్రీమియర్ షోను ప్రేక్షకుల కోసం గురువారం ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి సినిమాలోని నటీనటులు తిలకించారు. సినిమా అనంతరం వారు మాట్లాడుతూ యావత్ తెలంగాణలో ప్రతిఇంటిలో జరిగే సంఘటనల ఆధారంగానే ఈ సినిమా తీశామని, కుటుంబ సమేతంగా ప్రేక్షకులు ఈ సినిమా చూసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో హీరోయిన్ నవ్యస్వామి, అంజిమామ, థియేటర్ యజమాని వెంకట్ పాల్గును, మేనేజర్ మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

వరంగల్: జీఓ నంబర్ 21 ప్రకారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసి, ఏజెన్సీలను రద్దు చేసి కమిటీ ద్వారానే వేతనాలు అందించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు మాసాని భాస్కర్ కోరారు. ఈమేరకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, మార్కెట్ ఎస్‌జీఎస్ బీవీ.రాహుల్‌కు గురువారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. వినతి పత్రాలు సమర్పించిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బు రాజేందర్, కోశాధికారి చందనాల రాము, సింగారపు యాకయ్య, పార్శి సందీప్‌కుమార్, చిర్ర యాకోబు, నమిండ్ల నరసయ్య, బొమ్మగాని రవీందర్, ఈసంపల్లి యాదగిరి, యాకూబ్‌పాషా, పి.శ్రీనివాస్, ఎండీ.నజీరుద్దీన్, మెరుగు యాకయ్య, కే.శ్రావణ్‌కుమార్, ఎస్.నాగార్జున, ఎండీ.వాజిద్‌పాషా, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడలకు అవకాశం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం పథకంలో గౌడ కులస్తులకు అవకాశం ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కారక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుంగాని ప్రసాద్, చందర్ పాల్గొన్నారు.

నిజాం పాలనపై ఉద్యమ బావుటా



నివాళి అర్పిస్తున్న కాలనీ కమిటీ సభ్యులు

హన్మకొండ: నిజాం నిరంకుశ పాలకులపై అక్షర తుపాకీ ఎక్కుపెట్టి ఉద్యమ బావుట ఎగురవేసి ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించిన సాయుధ పోరాట యోధుడు, గొప్ప సాహితీవేత్త దాశరథి రంగాచార్యులు అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, హనుమాన్‌నగల్–1 అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. రంగాచార్యుల 8వ వర్ధంతిని పురస్కరించుకుని దాశరథి చిత్రపటానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు కుమార్‌రెడ్డి, సిరిమల్లె రాజయ్య, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, చిరంజీవి, సురేష్, గణేష్ పాల్గొన్నారు.